క్లుప్తంగా

విద్యార్థులకు స్టీలు ప్లేట్ల పంపిణీ



విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేసిన దృశ్యం

చింతలపూడి : బట్టువారిగూడెం ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన నిమిత్తం స్టీలు ప్లేట్లు పంపిణీ చేశారు. క్లబ్ ఆధ్వర్యంలో పీఎం జేఎఫ్ లయన్ చిల్లపల్లి రామమోహన్‌రావు, పీఎంజేఎఫ్ లయన్ విజయలక్ష్మి ఆర్థిక సహాయంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చింతలపూడి క్లబ్ అధ్యక్షులు రాజేష్‌ఖన్నా తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు మల్లెల సరళ విజయకుమారి లయన్స్ క్లబ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుక్కునూరులో భారీ వర్షం

కుక్కునూరు : బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో గురువారం కుక్కునూరు మండల వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా పలు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలలో ఇళ్లలోకి వరద నీరు చేరింది. కాగా నిన్న మొన్నటి వరకు ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు వాతావరణం చల్లబడటంతో సేదతీరారు. ఈ వర్షం వ్యవసాయానికి అనుకూలమని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పురోహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



శ్రీనివాసాచార్యులు భార్యకు నగదు అందజేస్తున్న ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు

ద్వారకాతిరుమల : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వాహన పూజల పురోహితుడు సాతులూరి శ్రీనివాసాచార్యులు కుటుంబానికి శ్రీవారి దేవస్థానం పురోహితులు, దేవస్థానం సిబ్బంది రూ.72 వేలను ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ నగదును ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు చేతులమీదుగా శ్రీనివాసాచార్యులు భార్యకు గురువారం అందించారు. రోడ్డు ప్రమాదంలో శ్రీనివాసాచార్యులు మృతి చెందడం చాలా బాధాకరమని రమణరాజు ఈ సందర్భంగా సంతాపం వ్యక్తం చేశారు.

ఎంపీ శ్రీధర్ పరామర్శ



రఘునాథ్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎంపీ శ్రీధర్

లింగపాలెం : లింగపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత చిలుకూరి రఘునాథ్‌రెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. గురువారం ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ లింగపాలెంలో రఘునాథ్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. ఎంపీ వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ మేడవరపు అశోక్, లింగపాలెం మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు కొఠారి మోహన్, రంగాపురం సొసైటీ చైర్‌పర్సన్ రెడ్డిన శ్రీను, నాయకులు కలకొండ పురుషోత్తం, అసిలేటి జయరాజు, శావా రాజేష్ తదితరులు ఉన్నారు.

వ్యాయామ కళాశాల విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులతో కళాశాల సిబ్బంది

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాల విద్యార్థులు క్రమశిక్షణతో నిరంతర సాధన చేసి కలెక్టర్ చేతులమీదుగా అవార్డు పొందడం అభినందనీయమని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నత్తానియేల్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యాకళాశాల విద్యార్థుల ప్రదర్శనకు మొదటిస్థానం రావడం, కలెక్టర్ రూ. 15 వేలు నగదు బహుమతి, జ్ఞాపిక, సర్టిఫికెట్ అందజేయడం గర్వకారణమన్నారు. గురువారం కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్.నత్తానియేలు, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శ్యామల, ఫిజికల్ డైరెక్టర్లు రమేష్, విజయలక్ష్మి, విద్యార్థులను అభినందించారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పీడీఎస్‌ఓ) రాష్ట్ర సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం స్థానిక అల్లూరి సత్యనారాయణ భవనం (సీఐటీయూ కార్యాలయం)లో నిర్వహించనున్నట్టు ఆ సంస్థ జిల్లా కార్యదర్శి ఎస్ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాద్, ప్రస్తుత ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్, అధ్యక్షుడు ఎస్ భాస్కర్ పాల్గొంటారని పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు విద్యార్థి ప్రదర్శన, వైద్య విద్యలో సెల్ఫ్ ఫైనాన్స్ పేరుతో సీట్ల అమ్మకానికి నిర్ణయించడంపై ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేయనున్నట్టు తెలిపారు.

దేశానికే ఆదర్శంగా సంక్షేమ పాలన



బుట్టాయగూడెం : రాచన్నగూడెంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



జంగారెడ్డిగూడెం రూరల్ : లక్కవరంలో చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజాకు హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న దృశ్యం

బుట్టాయగూడెం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడంతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి ఆత్మీయ స్వాగతం లభిస్తుందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. జీలుగుమిల్లి మండలం రాచన్నగూడెం సచివాలయ పరిధిలోని రాచన్నగూడెం, లంకాలపల్లి, తాటిరామన్నగూడెం, గోపాలపురం గ్రామాల్లో గురువారం 181వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే బాలరాజు ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆ సమయంలో ప్రతిఒక్కరూ చిరునవ్వులతో ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వలంటీర్ల ద్వారా నేరుగా అందుతున్నాయని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు అమలు చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచారని అన్నారు. నవరత్న పథకాల్లో అర్హులైన వారికి పింఛన్లు, జగనన్న తోడు, జగనన్న కాలనీలు, అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన వంటి అనేక పథకాలను అమలు చేస్తూ పేదలకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిగా గెలిపించాలని బాలరాజు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోర్స పోశమ్మ, జెడ్పీటీసీ మల్లం వసంతరావు, వైస్ ఎంపీపీ సోమగాని శ్రీనివాస్, సర్పంచ్ సున్నం వరలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు బోదా శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సున్నం సురేష్, జేసీఎస్ కన్వీనర్ వనమా రామకృష్ణ, నాయకులు చందాప్రసాద్, చిట్టిబొమ్మ శ్రీను, వీరంకి వెంకటేశ్వరరావు, కెక్కిరాల రాము, చక్రి, బి. ప్రేమ్‌కుమార్, ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఎస్సై చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం దిశగా ప్రభుత్వ పాలన

జంగారెడ్డిగూడెం రూరల్ : సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసాను కల్పించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మండలంలోని లక్కవరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎలీజా పాల్గొని ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. లబ్ధిదారులు ఎమ్మెల్యేని సత్కరించి హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులను కేటాయిస్తుందన్నారు. రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, విలేజ్ క్లీనిక్‌ల ద్వారా ప్రభుత్వం మెరుగైన సేవలను ప్రజలకు, రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. నాడు – నేడు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ ముఖ్యమంత్రిగా కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతి, సర్పంచ్ గెల్లా వెంకట రమణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వామిశెట్టి హరిబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మ గురునాథరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి, పార్టీ నాయకులు వందనపు సూర్యప్రకాష రావు, దల్లి నాగేశ్వరరావు, చిల్ల దుర్గారెడ్డి , మల్లెల్లి సూర్య తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలు, ఆర్బీకేలతో మెరుగైన సేవలు



సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం రూరల్ : సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలతో ప్రభుత్వం మెరుగైన సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిందని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మండలంలోని పేరంపేటలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి అన్ని రకాల ప్రభుత్వ సేవలు సచివాలయాల్లో అందేలా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. అలాగే రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. రైతులకు మేలైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించడంతో పాటు రైతు పండిన పంటలను కొనుగోలు చేసే ప్రక్రియ వరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా నిర్వహించడం జరుగుతుందన్నారు. వ్యవసాయంలో మెళకువలను తెలియజేయడంతోపాటు ఆన్‌లైన్ ద్వారా శాస్త్రవేత్తలు రైతులకు కావాల్సిన సూచనలు, సలహాలను అందించడం జరుగుతుందన్నారు. ప్రతి రైతుకి రైతు భరోసా ద్వారా సంవత్సరానికి రూ.13,500 నగదు ఇవ్వడం గొప్ప విషయమన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా అందే సేవలను రైతులు సద్వినియోగం చేసుకుంటూ వ్యవసాయ రంగంలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొదమ జ్యోతి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీటీసీ ఇర్ల విజయశాంతి, సర్పంచ్ కంకిపాటి కుమారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి, వైఎస్సార్ సీపీ నాయకులు ఇర్ల శ్రీనివాసరెడ్డి, కొయ్య రమారెడ్డి, తహసీల్దార్ స్లీవజోజి, ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

ఐటీడీఏ పీఓ సూర్యతేజ



సీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న పీఓ సూర్యతేజ

బుట్టాయగూడెం : ప్రభుత్వ వైద్యులు అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా కృషి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ అన్నారు. బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బందికి సంబంధించిన రికార్డులను పీఓ పరిశీలించారు. అనంతరం అన్ని వార్డులను తిరిగారు. ఫిజియోథెరపీ, నవజాతి సంరక్షణ కేంద్రం, రోగుల వార్డులు తిరిగి అందుతున్న వైద్య సేవలపై సీహెచ్‌సీ సూపరింటెండెంట్ కిషోర్ నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆరోగ్యశ్రీ పథకంలో అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీఓ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకంలో ప్రభుత్వం పొందుపరచిన అన్ని జబ్బులకు వైద్యసేవలు అందించేలా కృషి చేయాలన్నారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాలకు సంబంధించి తక్షణ వైద్యసేవలు అందించాలన్నారు. అలాగే ఆసుపత్రిలోని 25 మంది ఇన్ పేషంట్స్ వైద్యం పొందుతున్నారని, గురువారం సుమారు 75 మంది ఆస్పత్రికి వచ్చి వైద్యసేవలు పొందినట్లు వైద్యులు పీఓకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు జనార్ధన్, హేమత్, ప్రశాంత్, వసుంధర, సౌమ్య, వినిత, ఇమిమా తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక క్రమశిక్షణతోనే స్వావలంబన



భీమడోలులో ఆర్థిక లావాదేవీలు, నిబంధనలను వివరిస్తున్న ఏపీఎం పి.సురేష్‌కుమార్

భీమడోలు: మహిళల ఆర్థిక క్రమశిక్షణ ద్వారానే కుటుంబాలు ఆర్థిక స్వావలంబన సాధిస్తాయని ఏపీఎం పి.సురేష్‌కుమార్ అన్నారు. భీమడోలు మండల సమైఖ్య కార్యాలయంలో గురువారం డ్వాక్రా సంఘాల ఆర్థిక లావాదేవీలు, ఆర్థిక వ్యవహారాల నిబంధనలపై గ్రామ సంఘాల ప్రతినిధులకు ఒక రోజు అవగాహన సదస్సును నిర్వహించారు. ఏపీఎం పి.సురేష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళ సాధికారతే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, వాటిన్నింటినీ సద్వినియోగం చేసుకుని ఆర్థిక పరిపుష్టిని సాధించాలన్నారు. మహిళలు పొదుపును అలవర్చుకుని కుటుంబాలకు ఆర్థిక శక్తిగా మారాలన్నారు. సంక్షేమ పథకాల ద్వారా మహిళల వ్యక్తిగత ఖాతాలకు జమ అయ్యే నగదుతో చిన్న దుకాణాలను ఏర్పాటు చేసుకుని మరింత ఆర్థికంగా ఎదగాలన్నారు. లక్షలాది రూపాయలు లావాదేవీలు చేస్తున్న మహిళలు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్థిక అక్షరాస్యతల అవశ్యకతపై వారికి అవగాహన కల్పించారు. గ్రామస్థాయిలోని డ్వాక్రా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత గ్రామ సంఘాల ప్రతినిధులపై ఉందన్నారు. తొలుత డీఎం జీవీ గోపి ప్రొజెక్టర్‌పై ఆర్థిక అక్షరాస్యత, లావాదేవీల తదితర అంశాలపై అవగాహన కలిపంచారు. ఈ కార్యక్రమంలో సీసీలు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

హుండీల ఆదాయం రూ.1.89 లక్షలు



శ్రీ రామలింగేశ్వర స్వామి హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు, ఆలయ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పత్తేబాదలోని చౌడేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో హుండీల ఆదాయం రూ.1,89,840 లభించినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.శంకరరావు తెలిపారు. ఈ ఆదాయం 156 రోజులకు భక్తులు సమర్పించుకున్నారని చెప్పారు. గురువారం నిర్వహించిన హుండీల ఆదాయం లెక్కింపును దేవదాయశాఖ ఏలూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ బి.లక్ష్మీ నరసింహరావు పర్యవేక్షించారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బళ్ల రవి కుమార్, ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ టీఎఫ్ నేతల హర్షం

దెందులూరు: రాష్ట్రంలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టర్ ఉద్యోగులకు ముఖ్యమంత్రి క్రమబద్ధీకరణ చేయడం స్వాగతిస్తున్నామని వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీజే కెనడీ, జిల్లా కార్యదర్శి తోట ఎడ్వర్డ్, మండల నాయకులు రాబర్ట్, దాసు హర్షం వ్యక్తం చేశారు. గురువారం దెందులూరులో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీజే కెనడీ నివాసంలో నాయకులు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఆశయాలకు అనుగుణంగా ఆయన స్ఫూర్తితో ఇచ్చిన మాటను తప్పకుండా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, వైఎస్సార్‌టీఎఫ్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, బంధువులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతగా మద్దతుగా ఉంటారని యూనియన్ పరంగా, వ్యక్తిగతంగా ఈ నిర్ణయం తమకెంతో సంతోషంగా ఉందని పీజే కెనడీ అన్నారు.

సచివాలయాల ద్వారా అందుబాటులోకి ప్రభుత్వ సేవలు



ఆర్అండ్ఆర్ కాలనీలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి) : జీలుగుమిల్లి మండలం రాచన్నగూడెం సమీపంలో తట్కూరుగమ్ము నిర్వాసితుల పునరావాస కాలనీలో నూతనంగా సుమారు రూ.42 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా మారుమూల గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుతున్నాయని చెప్పారు. సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వేలేరుపాడు జెడ్పీటీసీ జి.రామలక్ష్మి, వైస్ ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీ ఎం.రాంబాబు, పార్టీ మండల కన్వీనర్ కేసగాని శ్రీనివాస గౌడ్, నాయకులు కామినేని వెంకటేశ్వరరావు, సర్పంచ్ కత్తి ఉదయ్‌కిరణ్, కోఆప్షన్ సభ్యులు హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ ప్రారంభం



ఫొటోగ్రాఫర్లు నిర్మించిన బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

టి నరసాపురం : ఫొటోగ్రాఫర్ల యూనియన్ ద్వారా సామాజిక సేవలు నిర్వహించడం ఆహ్వానించదగ్గ పరిణామం అని ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టా నాగరాజు అన్నారు. టి.నరసాపురం జెడ్పీహెచ్ పాఠశాల వద్ద టి.నరసాపురం ఫొటోగ్రాఫర్ల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్ షెల్టర్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు దేవరపల్లి సీతారామయ్య, కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే విగ్రహాన్ని రాష్ట్ర ఫొటోగ్రాఫర్ల సంఘ అధ్యక్షుడు ఎం.నాగరాజు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేసిన టి నరసాపురం ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లను వారు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజును ఫొటోగ్రాఫర్లు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏలూరుజిల్లా ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ అధ్యక్షుడు అమీర్ బాషా, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు కన్నం సర్వేశ్వరరావు, టి.నరసాపురం మండల అధ్యక్షుడు పలగాని ప్రసాద్, ఫొటోగ్రాఫర్లు పి.భార్గవ్, మహారాజు, కె.సత్యనారాయణ, దాసరి బాబీ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

కొయ్యలగూడెం : తాగునీటి సమస్యల పరిష్కరించాలని కోరుతూ సీపీఐ నాయకులు గురువారం ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు మాట్లాడుతూ మంగపతిదేవిపేట గ్రామంలో మంచినీటి పైపుల నుంచి బురద నీరు వస్తుందని నూతన పైపులను వేయాలని కోరారు. కన్నాపురం, పొంగుటూరు గ్రామపంచాయతీ పరిధి కన్నాయిగూడెం, గవరవరం, పరింపూడి గ్రామాలలో మంచి నీటి కొరత ఎక్కువగా ఉందన్నారు. ఆయా ప్రాంతాలలో మంచినీటి ట్యాంకులు నిర్మించి, ప్రజల దాహార్తి తీర్చాలని కోరారు. కార్యక్రమంలో మండల సహాయక కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, పట్టణ కార్యదర్శి ఎస్‌కే.బాజీ, కట్ట మహాలక్ష్మయ్య, ధగాని వెంకటేశ్వరరావు, లక్క లక్ష్మణరావు, షేక్ రజాక్, గొరుముచ్చు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల తనిఖీ



పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

పెదపాడు: మండలంలోని ఉప ఎన్నికలు నిర్వహించనున్న పోలింగ్‌స్టేషన్లను పెదపాడు ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి, తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు పరిశీలించారు. గురువారం పాతముప్పర్రు, వీరమ్మకుంట గ్రామాల్లో పోలింగ్ స్టేషన్లను వారు పరిశీలించి అక్కడ ఏర్పాట్లు పర్యవేక్షించారు. విద్యుత్, తాగునీరు, పోలింగ్ అధికారులకు వసతి ఏర్పాటు చేయాలని స్థానిక పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని పోలింగ్ నిర్వహించనున్న గ్రామాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు అమలులో ఉంటుందన్నారు.

పాఠశాలలో పోలింగ్‌కు ఏర్పాట్లు

భీమడోలు: పోలసానిపల్లి 12వ వార్డు ఉప ఎన్నికకు సంబంధించి పోలింగ్ కేంద్రంగా ఉన్న పోలసానిపల్లి-2 పాఠశాలకు ఈనెల 18, 19వ తేదీలు సెలవులు ప్రకటించినట్లు ఎంఈవో ఈడ్పుగంటి శ్రీనివాసరావు గురువారం తెలిపారు. డీఈవో శ్యాం సుందర్ ఆదేశాల మేరకు మిగిలిన 1, 3 పాఠశాలలు యథావిధిగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 18వ తేదీ శుక్రవారం పోలింగ్ సామగ్రిని కేంద్రానికి తరలించి ఏర్పాట్లు చేస్తారని, 19వ తేదీ శనివారం పోలింగ్ నిర్వహిస్తారని తెలిపారు. వార్డు పరిధిలోని ఓటర్లంతా ఈ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని అన్నారు.

వివాహిత మృతిపై కేసు నమోదు

టి.నరసాపురం : వివాహిత మృతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని ఏపుగుంటకు చెందిన చాపలమడుగు సౌజన్య అత్తను బెదిరించాలని క్షణికావేశంలో కలుపు మందు తాగింది. అదే సమయంలో పక్కనే ఉన్న తన కుమార్తె అక్షర (2) కలుపుమందు డబ్బా నోటిలో పెట్టుకుంది. విషయం తెలిసిన సౌజన్య భర్త రమేష్ ఇద్దరిని చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి ఏలూరు, విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె 15వ తేదీ రాత్రి మృతి చెందింది. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం, భర్త రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. కాగా రమేష్ కుమార్తె అక్షర కోలుకోవడంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయినట్లు ఎస్సై తెలిపారు.

గౌడ మహాసభకు తరలిరండి

కొయ్యలగూడెం: బయ్యనగూడెంలో శుక్రవారం నిర్వహించే గౌడ మహాసభకు గౌడవర్గీయులు భారీ సంఖ్యలో తరలిరావాలని మండల గౌడ సంఘం పిలుపు ఇచ్చింది. గురువారం మదన గోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో మండల శాఖ అధ్యక్షుడు ఏకుల గద్దియ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకుని బయ్యనగూడెంలోని ఫంక్షన్ హాల్‌లో భారీ సభ ఏర్పాటు చేశామని అన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర గౌడ సంఘం నాయకులు చనుమోలు అశోక్‌గౌడ్, మిడత పెంటయ్య ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో కట్టా సత్యనారాయణ, అబ్బు సుబ్రహ్మణ్యం, మాడిశెట్టి శ్రీను, మట్టా సత్యనారాయణ, ఆరేపల్లి శ్రీను, మట్ట చిన్న కిట్టు, మట్ట గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు కాపవరంలో గడపగడపకు మన ప్రభుత్వం

బుట్టాయగూడెం : మండలంలోని సీతప్పగూడెం సచివాలయ పరిధిలో గల గ్రామాల్లో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల కాపవరం సమీపంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం కామవరం, రాచూరు, కుమ్మరికుంట, లంకాలపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పర్యటిస్తారని, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ కోతల వేళలు

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం 33/11 కేవి, రామారావుపేట సెంటర్ సమీపంలోని విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో ఫీడర్ ట్రీ కట్టింగ్ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జంగారెడ్డిగూడెం విద్యుత్‌శాఖ ఈఈ పి.రాధాకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బుట్టాయగూడెం మండల పరిధిలోని గ్రామాల్లో ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

లింగపాలెం మండల ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడిగా నాగేంద్రబాబు



టి నాగేంద్రబాబు, ముడిచెర్ల

లింగపాలెం : లింగపాలెం మండల ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడిగా ముడిచెర్ల గ్రామానికి చెందిన తాళ్లూరి నాగేంద్రబాబు ఎన్నికయ్యారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఏలూరు జిల్లా ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు నమ్మిన నాగరాజు ఆధ్వర్యంలో ఏలూరులో జరిగిన సమావేశంలో కోస్తా జిల్లాల ఎంఆర్‌పీఎస్ ఇన్‌చార్జి ముమ్మడివరపు చిన్న సుబ్బారావు తన నియామకంపై ప్రకటించినట్లు తెలిపారు. అదేవిధంగా ఎంపీఎస్ అధ్యక్షుడిగా జోలా వెంకటేశ్వరాను నియమించారని నాగేంద్రబాబు పేర్కొన్నారు.

మానవత శాంతి ర్యాలీ



జంగారెడ్డిగూడెంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న మానవత సభ్యులు

జంగారెడ్డిగూడెం : మానవత ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జంగారెడ్డిగూడెంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. జిల్లా రక్తనిధి చైర్మన్ అయినాల రమణమూర్తి మాట్లాడుతూ ఆగస్టు 22 మానవత ఆవిర్భావ దినత్సోవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా శాంతి ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీని జెడ్పీ హైస్కూల్ నుంచి మసీద్ సెంటర్, కొత్త బస్టాండ్, సూర్య కళాశాల రోడ్, విద్యావికాస్‌కళాశాల వరకు నిర్వహించారు. సుమారు 300 మంది విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొనగా, స్థానిక బోసుబొమ్మ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు.

జర్నలిస్టుల రక్షణకు కఠిన చట్టాలు అమలు చేయాలి

చింతలపూడి : దేశవ్యాప్తంగా జర్నలిస్టులపై జరుగుతున్న దాడుల నుంచి రక్షణ కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలను అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (ఏపీయూడబ్ల్యూజే) నేతలు డిమాండ్ చేశారు. యూనియన్ 66 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చింతలపూడి పట్టణంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం గ్రామీణ విలేకరులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

డీఈఎల్‌ఈడీ పరీక్షకు 164 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డీఈఎల్‌ఈడీ 3వ సెమిస్టర్ పరీక్షలు, ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా గురువారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. సెమిస్టర్ పరీక్షలకు 148 మంది విద్యార్థులకు 145 మంది హాజరుకాగా ముగ్గురు గైర్హాజరయ్యారు. సప్లిమెంటరీ పరీక్షకు 70 మందికి 19 మంది హాజరు కాగా 51 మంది గైర్హాజరయ్యారు. మాల్ ప్రాక్టీస్ కేసులూ నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్ తెలిపారు.